క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గోపవరం : మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. అన్నిశాఖల అధికారులు ప్రజావేదికలో పాల్గొంటారని, సమస్య ఉంటే ప్రజలు ప్రజావేదికలో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు.

పోలేరమ్మకు బోనాలు



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

పోరుమామిళ్ల (అట్లూరు) : పట్టణంలోని మహిళలు పోలేరమ్మ తల్లి, చౌడమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఆషాఢ గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మహిళలందరూ పసుపు, కుంకుమ, బియ్యం తీసుకుని బోనాలు సమర్పించారు. ఉత్సవంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు



శివకిరణ్‌కు స్వాగతం పలుకుతున్న నారాయణరెడ్డి

కలసపాడు : యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా కరోలి గ్రామానికి చెందిన శివకిరణ్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం కలసపాడుకు చేరుకుంది. కలసపాడుకు చెందిన పీరారెడ్డి, రామకోటి, పెద్దయ్య, బోరుబాలుడు శివకిరణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ యువత అభద్రతా భావం విడనాడాలని, ధైర్యంగా ఉండాలని సూచించారు.

24న సంకష్ట హర చతుర్థి పూజ

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని కేవీఆర్ కాలనీలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24న బుధవారం సాయంత్రం 6 గంటలకు సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

తైక్వాండోలో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న మాస్టర్ మారుగాని సుధీర్

దువ్వూరు : ప్రొద్దుటూరులో కేఎంహెచ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో దువ్వూరుకు చెందిన షిరిడి సాయి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో విద్యార్థులకు 3 బంగారు పతకాలు, 7 రజతం, 6 కాంస్య పతకాలు మొత్తం 16 పతకాలు సాధించారు. బాలికల విభాగంలో కేతన, శ్రీవాణి బంగారు పతకాలు సాధించగా, ముగ్గురు విద్యార్థినులు రజత పతకాలు సాధించారు. బాలుర విభాగంలో విజయకుమార్ బంగారు పతకం సాధించగా, నలుగురు రజత పతకాలు, ఆరుగురు కాంస్య పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థులు విన్ తైక్వాండో అకాడమి ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. పతకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం మస్తాన్, కరాటె మాస్టర్ సుధీర్ అభినందనలు తెలిపారు.

హెల్మెట్‌తోనే రక్షణ

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనాలు నడిపే యువతకు హెల్మెట్‌తోనే రక్షణ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. ఆర్ఆర్ రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన హెల్మెట్ ధరించండి అనే ప్రచార కరపత్రాలను ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు.

విద్యార్థిని గాయపరచడం తగదు

కడప రూరల్ : వాహనాల తనిఖీలో భాగంగా ఈ నెల 20వ తేదీన కడప నగరంలో విద్యార్థి నవదీప్‌ను పోలీసులు గాయపరచడం దారుణమని ఆంధ్రప్రదేశ్ స్టాండింగ్ కమిటీ మానవ హక్కుల విభాగం నాయకుడు బాదుల్లా అన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నవదీప్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వాహనాల తనిఖీని చూసి నవదీప్ భయభ్రాంతులకు గురై వెనుతిరిగి వెళ్తుండగా, పోలీసులు వెంబడించి పట్టుకొని గాయపరచడం తగదని తెలిపారు.

సాగు.. సాగేదెలా..!

- వర్షాలు లేక దిక్కులు చూస్తున్న రైతాంగం
- వైఎస్సార్ హయాంలోనే రాజోలికి శంకుస్థాపన
- గత ప్రభుత్వ హయాంలోనే పురోగతి



రాజోలి ఆనకట్ట



ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న వర్షం నీరు

రాజుపాళెం : వర్షాలు లేకపోవడంతో కేసీ ఆయకట్టు రైతుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతం నుంచి సంవృద్ధిగా శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరినప్పుడే సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ ప్రాంతంలోని రాజోలి ఆనకట్ట వద్ద జలాశయం నిర్మించాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పెద్దముడియం మండలంలో 2008 డిసెంబరు 24న శంకుస్థాపన చేశారు. అయితే ఆయన మరణానంతరం రాజోలి గురించి ప్రస్తావన రాలేదు. అనంతరం టీడీపీ ప్రభుత్వంలో ఈ ఊసే లేకపోవడంతో రైతులంతా ఆందోళన చెందారు.

రిజర్వాయరు నిర్మాణానికి ప్రతిపాదనలు

వైఎస్సార్ కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతంలో రాజోలి రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదన ముందుకు వెళ్లింది. నిధులు విడుదల చేసి భూసేకరణకు సంబంధించి రైతుల వివరాలను కూడా సేకరించి వారికి నష్ట పరిహారం చెల్లించే విధంగా ప్రణాళికలను రూపొందించారు. ఈ రిజర్వాయర్‌కు 9,286 ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు గుర్తించారు. అందులో నెమ్మలదిన్నె, బలపనూరు, చిన్నముడియం, ఉప్పలూరు, గరిశలూరు గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించారు. ఈ జలాశయ నిర్మాణానికి రూ.1,357,10 కోట్లు కేటాయించారు. ఈ క్రమంలో ముంపు బాధిత రైతుల నుంచి ఒప్పంద పత్రాలు తీసుకొని ఎకరాకు రూ.12.50 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. పరిహారం ఇవ్వడంతో జాప్యం జరగడంతో రైతులంతా ఆవేదన చెందారు. గత ఎన్నికలకు ముందు కూడా పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాజోలి రిజర్వాయర్‌ను తప్పకుండా నిర్మిస్తామని హామీ కూడా వచ్చారు.

ఆరుతడి పంటలే సాగు

అయితే మూడేళ్లుగా పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు లేక కేసీ ఆయకట్టు పరిధిలో వరి పంటను సాగు చేయలేకపోయారు. కేవలం ఆరుతడి పంటలే సాగు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో మైలవరం జలాశయం నుంచి వచ్చే నీటిని చాపాడు కేసీ కాలువకు మళ్లించి కొద్దిమేర పంటలను కాపాడుకున్నారు. ఈ పరిస్థితుల్లో రాజోలి ఆనకట్ట వద్ద 2.95 టీఎంసీ సామర్థ్యంతో జలాశయం నిర్మిస్తే ఆటు తాగు,సాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు అంటున్నారు. ఈ ప్రభుత్వం లోనైనా రాజోలి రిజర్వాయరు నిర్మాణంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కేసీ కెనాల్ రైతాంగం కోరుతోంది.

పూర్తయితే సస్యశ్యామలం

రాజోలి పూర్తయితే ఈ ప్రాంతంసస్యశ్యామలంగా మారనుంది. గత కొన్నేళ్లుగా అక్కడ రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా నిర్మించలేదు. అయితే వర్షాకాలంలో అధికంగా వచ్చిన నీరంతా దిగువ ప్రాంతాలకు పోతోంది. అదే రిజర్వాయరు ఉంటే నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు రాకపోయినా రిజర్వాయర్‌లో ఉన్న నీటిని దిగువకు వదిలితే పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ చాపాడు కాలువ, కుందూనది, కేసీ ప్రధాన కాలువ కింద సుమారు 97 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లోని రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోనున్నారు.

రిజర్వాయర్ నిర్మిస్తే రైతుల కల సాకారం



రాజోలి ఆనకట్ట వద్ద రిజర్వాయరు నిర్మిస్తే రైతుల కల సాకారం అవుతుంది. గత కొనేళ్లుగా అక్కడ రిజర్వాయరు నిర్మించాలన్న ఆశలు అడియాశలు అవుతున్నాయి. గతంలో వర్షాలు సకాలంలో రాకపోవడంతో చాలామంది రైతులు పంటలు సాగు ఆలస్యమైంది. రిజర్వాయర్ నిర్మిస్తే రైతులంతా సంతోషిస్తారు. కూటమి ప్రభుత్వం రాజోలిని నిర్మించాలి.

– ఎర్రి రమణారెడ్డి, రైతు, గాదెగూడూరు గ్రామం, రాజుపాళెం మండలం

రెండు పంటలు పండిచుకునేందుకు అవకాశం



రాజోలి, జోలదరాశి రిజర్వాయర్ల నిర్మాణం వల్ల కేసీ కెనాల్ ఆయకట్టు కింద రైతులు రెండు పంటలు పండిచుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో వర్షాలు ఆలస్యంగా వచ్చిన రిజర్వాయర్‌లోని నీటితో పంటలను సాగు చేసుకోవచ్చు. అలాగే గతంలో రాజోలి జలాశయం కింద భూములు కోల్పోయిన బాధిత రైతులకు పరిహారం పెంచాలి. త్వరితగతిన రాజోలి నిర్మాణ పనులు చేపడితే బాగుంటుంది.

– ఉమ్మడి సహదేవ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ జిల్లా

పట్టుదలే ఆయుధం

డాక్టరేట్ సాధించిన రైతుబిడ్డ



డాక్టరేట్ అందుకుంటున్న సుభాస్కర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఆకలి కష్టపడటాన్ని అలవాటు చేస్తుంది. ఆలోచన బతకడాన్ని నేర్పిస్తుంది. లక్ష్యం జీవితాన్ని విజయపథంలో నడిపిస్తుంది. ఇందుకు నిలువెత్తు నిదర్శనం ఆ యువకుడు. పట్టుదలే ఆయుధంగా కష్టాలు, కన్నీళ్లను అధికమించి డాక్టరేట్ సాధించిన ఓ రైతుబిడ్డ ఘనత గురించి వివరాల్లోకి వెళితే బద్వేలు మండలం నందిపల్లె గ్రామానికి చెందిన పంగాబ్రహ్మారెడ్డి, రామసుబ్బమ్మ దంపతుల కుమారుడైన పంగాసుభాస్కర్‌రెడ్డి రసాయన శాస్త్రంలో మంగళూరు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. తల్లిదండ్రులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండటంతో సుభాస్కర్‌రెడ్డి విద్యాభ్యాసం నందిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. బద్వేలులో న్యూవిద్యారణ్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాడు.

ఉద్యోగం చేస్తూ..

అనంతరం వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేశాడు. గోవాలోని సింజెంటా అనే రసాయనాల కంపెనీలో ఉద్యోగం చేస్తూ సెలవు రోజుల్లో, వారాంతాల్లో దొరికే సమయాన్ని మంగళూరులో యూనివర్సిటీలో పరిశోధనలకు కేటాయించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ భానుమంజునాథ్ పర్యవేక్షణలో నోవెల్ నైట్రోజన్ హెటెరో సైక్లిక్ కాంపౌండ్స్ ఆఫ్ బయోలాజికల్ ఇంటరెస్ట్, సల్ఫాక్సిమిన్స్ అండ్ ఫొరజోల్ (3, 4–బి) పిరిడిన్ డెరిరేటివ్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. విశ్వవిద్యాలయం నుంచి సుభాస్కర్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ జిల్లాస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారు ఆగస్టులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 180 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, కేడెట్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, సెక్రటరీ నాయబ్ రసూల్, ఆర్గనైజన్ సలీం, బాషా, న్యాయవాది రమేష్, తైక్వాండో అసోసియేషన్ నెల్లూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అనంతపురం కార్యదర్శి సాయిబాబా, కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్, తైక్వాండో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



నరసాపురంలో స్నానానికి వెళుతున్న పీర్లు

కాశినాయన : హిందూ, ముస్లింలు కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. మండలంలోని గొంటువారిపల్లె, గంగనపల్లె, నరసాపురం, ఉప్పలూరు, కొండ్రాజుపల్లె గ్రామాల్లో ఆదివారం మొహర్రం పండుగను హిందూ, ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పీర్లు స్నానానికి వెళుతున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పీర్లకు బొరుగులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగలో వేసిన వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు అగ్నిగుండంలో నడిచారు. నరసాపురంలో రెండు గుమ్మటాలు కలిసిన సమయంలో బొరుగులు చల్లారు. గ్రామాల్లో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కూలిన కల్వర్టు.. రాకపోకలకు అంతరాయం



శంఖవరం వద్ద ప్రధాన రహదారిపై కూలిన కల్వర్టు

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామం వద్ద కలసపాడు – పోరుమామిళ్ల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ఆదివారం కూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా శంఖవరం గ్రామంలో నుంచి వాహనాల రాకపోకలను కొనసాగించారు. సాయంత్రం ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టుకు పైపులు వేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. అయితే ఇప్పటికైనా కూలిన కల్వర్టు స్థానంలో నూతనంగా కల్వర్టు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

కల్వర్టును త్వరగా నిర్మించాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : కలసపాడు మండలం శంఖవరం వద్ద కూలిపోయిన కల్వర్టుకు త్వరగా నిర్మించాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లా వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైల్వే స్టేషన్ మేనేజర్ భానుప్రకాష్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ యాదవ్ ఆధ్వర్యంలో స్టేషన్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు సీవీ జయలక్ష్మి, భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గౌరీశంకర్, చలపతిరావు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో 24 గంటలు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు సరిగా నిర్వహించడం, ప్లాట్‌ఫాం పొడిగించడం, ఫ్లోరింగ్ మరమ్మతులు చేయించాలని తెలిపారు. హైదరాబాద్-చెన్నైకి అనుసంధానం అయ్యేలా చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను ఎర్రగుంట్ల, నంద్యాల మీదుగా మళ్లించాలని, బెంగళూరుకు రైలు సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు.

పుస్తకాల అందజేత



అనాథ పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మంచితనానికి మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి సానపురెడ్డిగోపాల్‌రెడ్డి అని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి కొనియాడారు. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సానపురెడ్డిగోపాల్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక షాలోమ్ అనాథశరణాయంలోని అనాథ పిల్లలకు ఆయన కుమారులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి సమకూర్చిన రూ.25 వేలు విలువ చేసే పాఠ్యపుస్తకాలను మున్సిపల్ చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు గోపాల్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని ప్రశంసించారు. మున్సిపల్ చైర్మన్ సతీమణి మమత, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, కె.బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షులు జి.పుల్లయ్య పాల్గొన్నారు.

బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మైదుకూరు : మైదుకూరులో లక్ష్మి ఎలైట్ పార్క్ అపార్ట్‌మెంట్ అన్ని హంగులు, సౌకర్యాలతో నిర్మించామని అపార్ట్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ మైదుకూరు నియోకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం మైదుకూరులోని కేఎస్‌సీ కన్వెన్షన్‌లో లక్ష్మి ఎలైట్ పార్క్ అపార్ట్‌మెంట్ బ్రోచర్ విడుదల కార్యక్రమాన్ని సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ నిర్మాణం అన్ని రకాల అనుమతులతో చట్టబద్ధంగా నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కేంద్ర బిల్డింగ్ నిర్మాణ కార్మికుల సలహా మండలి సభ్యుడు వి.శ్రీనివాసనాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలివ్వాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి షేక్ కోరారు. ఆదివారం పోరుమామిళ్ల పట్టణంలోని పంచాయతీ ఆవరణలో పిడుగుపేరయ్య అధ్యక్షతన పంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఈయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు చట్టబద్ధత, కష్టానికి తగ్గ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. నూతన పంచాయతీ కార్మిక యూనియన్ కార్యదర్శిగా నాగేష్, సహాయ కార్యదర్శిగా ఓబులమ్మ, అధ్యక్షురాలుగా శారదమ్మ, ఉపాధ్యక్షులుగా బాలయ్య, గురయ్య, కోశాధికారిగా నాగరాజు, ప్రసాద్‌తో పాటు కౌన్సిల్ సభ్యులును ఎన్నుకున్నారు.

ఉపాధితో పండ్ల తోటల పెంపకం

బి.కోడూరు : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకం చేపట్టవచ్చని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మామిడి, చీనీ, సన్ననిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకుంటే 3 సంవత్సరాల పాటు ప్రభుత్వం ద్వారా వంద శాతం ఉచితంగా నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తామని తెలిపారు. రోజా, మల్లె, మునగ సాగుచేసే రైతులకు రెండు సంవత్సరాల నిర్వహణ ఛార్జీల చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి జాబ్‌కార్డు, భూమి పట్టాదారు పాసుపుస్తకం నకలు, వన్‌బి, సన్న, చిన్నకారు రైతుపత్రం, జాబ్‌కార్డులో ఉన్న వారి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను మండల ఉపాధి హామీ ఏపీఓ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకులకు అందజేయాలని సూచించారు.

ఉక్కు పరిశ్రమతో ఉపాధి కల్పన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశాల్లో ఈసారైనా కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీ అయిన కడప ఉక్కును గత పదేళ్లుగా కేంద్రం పూర్తిగా విస్మరించింది అన్నారు. కరువు, వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన రావాలంటే ఉక్కు పరిశ్రమ ఏకైక మార్గం అన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాదంశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్యసభ, సత్యప్రవీణ్ ఆర్థో, న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో కాలేయ సమస్యలకు హైటెక్ సిటీ యశోధ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందిపైగా రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కేఎస్ సోమశేఖరరావు కాలేయ వ్యాధుల లక్షణాలు వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణా చర్యలను రోగులకు వివరించారు. మద్యం సేవించే వారికి లివర్ కండీషన్‌ను ఉచితంగా పరీక్షించారు. అలాగే ఉచితంగా రక్త పరీక్షలు, హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ, ఫైబ్రోస్కాన్, హెచ్‌బీఎస్ఏజీ, యాంటి హెచ్‌సీవీ పరీక్షలను చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రొద్దుటూరు : స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజిలో ఆదివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ ఎం.రామ్‌శేఖర్‌రెడ్డి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచే సమస్యలకు ఇంజినీరింగ్ పరిష్కారం చూపుతుందన్నారు. వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రోబోటిక్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, త్రీడి ప్రింటింగ్ వంటి సాంకేతిక నైపుణ్యాల్లో విద్యార్థులు శిక్షణ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈ విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



గోపవరం: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



ప్రొద్దుటూరు కల్చరల్: ప్రత్యేక అలంకరణలో దొరసానిపల్లెలోని సాయిబాబా



బద్వేలు అర్బన్ : స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని సాయిబాబా, దత్తాత్రేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాల్లో బాబాను దర్శించుకునేందకు భక్తులు బారులు తీరారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి పంచామృతాభిషేకం, నూతన పట్టువస్త్రాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవగ్రహ, చండీహోమాలను నిర్వహించి వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వసంతపేటలోని సాయిబాబా ఆలయంలో బాబాను గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ కృష్ణ గీతాశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ కృష్ణునికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో యోగిరాజ వల్లభ దత్తాత్రేయస్వామికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అనఘాదేవి, దత్తాత్రేయస్వామి కల్యాణాన్ని నిర్వహించారు.

దొరసానిపల్లెలో..

దొరసానిపల్లెలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున సాయిబాబా మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వినియోగం చేశారు. ఆలయ చైర్మన్ కుడుముల ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్తల మునిరెడ్డి, కమిటీ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కాశినాయన : మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతిక్షేత్రంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని అర్ధరాత్రి కాశినాయన విగ్రహాన్ని డప్పు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కన్నుల పండువగా గురుపౌర్ణమి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని తెలుగుగంగ కాలనీ సమీపంలో ఉన్న దత్త సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున 4–30 గంటల నుంచే స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మొదట కాగడహారతి నిర్వహించి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీసాయి సత్యవ్రతము నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా పట్టణం నుంచే గాక సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా గురుపౌర్ణమి

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లె గ్రామ సమీపంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కూకట్లపల్లివెంకమ్మ, నారాయణ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.